
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 సిద్దిపేట
మంగళవారం 8 ఏప్రిల్ 2025



మొక్కలకు నీళ్లు అందించే పైపులోని నీటిని తాగుతున్న సందర్శకుడు

నిలువ నీడ లేదు.. గుక్కెడు నీళ్లు లేవు

- నీడ కోసం చెట్లు.. తాగడానికి మొక్కలకు పట్టే నీరే ఆధారం
- కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు తప్పని ఇక్కట్లు

కలెక్టరేట్‌కు నిత్యం ఏదో ఒక పనిమీద జనం వస్తుంటారు. సమస్యల సాధనకు ధర్నాలు.. వినతిపత్రాలు ఇవ్వడానికి కలెక్టరేట్ బాట పడుతుంటారు. ఇక ప్రజావాణి ఉన్న రోజు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తుంటారు. అలా వచ్చిన వారికి కలెక్టరేట్ బయట నిలబడడానికి నీడ లేక.. తాగడానికి గుక్కెడు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు గొంతు ఎండిపోతుండడంతో కలెక్టరెట్‌లో మొక్కలకు పట్టే పైపుతో నీళ్లు తాగి దాహం తీర్చుకుంటున్నారు. నీడ కోసం చెట్ల కింద సేద తీరుతున్నారు. అధికారులు స్పందించి ఎండ నుంచి రక్షణకు టెంట్, తాగునీరు అందించాలని జనం కోరుతున్నారు

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)





చెట్ల కింద సేదతీరుతున్న జనం

సిద్దిపేట స్టార్

- 'జల్‌హీ అమృత్'లో నాలుగు స్టార్లు
- ఇటీవల దక్కించుకున్న మున్సిపాలిటీ
- రూ.2.50 కోట్ల పారితోషికం
- రోజుకు కోటి లీటర్ల మురుగు శుద్ధి
- శుద్ధి చేసిన నీరు మొక్కలకు, చెరువుల్లోకి..

అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే పలు అవార్డులు అందుకున్న సిద్దిపేట మరోసారి స్టార్‌గా నిలిచింది. సిద్దిపేటలోని సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపీ) నిర్వహణ భేష్‌గా ఉండటంతో జల్ హీ అమృత్‌లో దేశంలోనే తళుక్కున మెరిసి 4 స్టార్ రేటింగ్‌ను కైవసం చేసుకుని రూ.2.50 కోట్ల పారితోషకాన్ని దక్కించుకున్నది. కేంద్ర బృందం జనవరి చివరి వారంలో ఓసారి.. ఫిబ్రవరిలో మరోసారి సిద్దిపేటలో సర్వే చేసింది. వాటి ఫలితాలను ఇటీవల ప్రకటించింది.

- సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)

దోమలు, ఈగలు లేని పట్టణంగా మార్చాలన్న లక్ష్యంతో అమృత్ పథకంలో భాగంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం మంచి సత్ఫలితానిస్తున్నది. దాదాపు రూ. 270కోట్లతో 325 కిలోమీటర్ల మేర నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నుంచి వెలువడుతున్న మురుగునీటిని శుద్ధి చేసేందుకు రూ.20.50 కోట్లతో సిద్దిపేట పట్టణ శివారులో రెండు సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపీ)లను నిర్మించారు. కొన్నేళ్ల క్రితం యూజీడీ నిర్మాణం పూర్తి చేసుకోవడంతో ప్రతి రోజు కోటి లీటర్లకు పైగా వస్తున్న మురుగు నీరును శుద్ధి చేసి ఆ నీటిని మొక్కలకు, చెరువులకు వదులుతున్నారు. ఈ ఎస్టీపీలను పరిశీలించిన కేంద్ర బృందం జల్‌హీ అమృత్‌లో 4 స్టార్ రేటింగ్ ఇచ్చింది.

రూ. 20.50 కోట్లతో రెండు దశల్లో నిర్మాణం

సిద్దిపేటలో ప్రతిరోజు వెలువడుతున్న మురుగునీటిని శుద్ధి చేసేందుకు రూ. 20.50 కోట్లతో పట్టణంలో రెండు దశల్లో ఎస్‌టీపీ ప్లాంట్లను నిర్మించారు. 2019లో మొదటి దశలో చింతల్ చెరువు వద్ద మూవింగ్ బెడ్ బయోరియాక్టర్ (ఎంబీబీఆర్), 2021లో రెండో దశలో నర్సాపూర్ చెరువు వద్ద సీక్వెన్సియల్ బ్యాచింగ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) టెక్నాలజీతో ఆధారంగా నిర్మించారు. చింతల్ చెరువు వద్ద రూ. 8 కోట్లతో 7.25 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ, నర్సాపూర్ చెరువు వద్ద రూ. 12.50 కోట్లతో 11 ఎంఎల్‌డీ కెపాసిటీతో నిర్మించారు. చింతల్ చెరువు వద్దనున్న ఎస్‌టీపీ 7.25 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం 6.5 ఎంఎల్‌డీల (65 లక్షల) మురుగునీరు మాత్రమే వస్తున్నది. నర్సాపూర్ ఎస్‌టీపీ వద్ద 11 ఎంఎల్‌డీ సామర్థ్యం కాగా 10 ఎంఎల్‌డీల (కోటి లీటర్లు) మురుగునీరు వస్తున్నది. 4 దఫాలుగా ఫిల్లింగ్, ఎయిరేషన్, సెట్లింగ్, డిక్యాంటింగ్ పద్ధతిలో సైక్లింగ్ చేయడంతో మురుగు నీటిలో ఉన్న బురద మొత్తం కిందకి చేరుకుంటుంది. ఈ వ్యర్థాలను సెంట్రిఫ్యూయిడ్‌లోని సంపులోకి పంపిస్తారు. ఎస్‌బీఆర్‌లోని నీటిని క్లోరినేషన్ కాంటాక్టు ట్యాంక్ (సీసీటీ)లోకి పంపి, క్లోరినేషన్ చేసి నీటిని శుద్ధి చేస్తున్నారు.



నర్సాపూర్ ఎస్‌టీపీ ప్లాంటులో శుద్ధి చేస్తున్న మురుగునీరు

మొక్కలకు, చెరువుల్లోకి..

24 గంటల పాటు దాదాపు 1.65 కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేస్తున్నారు. తద్వారా శుద్ధి చేసిన నీటిని ట్యాంకర్ల సహాయంతో పట్టణంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు, డివైడర్లపై, రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లకు ప్రతిరోజు నీరు అందిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల సూచన మేరకు స్థానిక చెరువుల్లోకి కూడా వదులుతున్నారు. ఇదంతా నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నియమ నిబంధనల ప్రకారం శుద్ధి చేసిన నీటిని అవసరాల నిమిత్తం ఉపయోగిస్తున్నారు.

ఇది సిద్దిపేట ప్రజల విజయం



సిద్దిపేట మున్సిపల్ పరిధిలో ఏ కార్యక్రమం తలపెట్టిన అందులో ముందుగా ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం. వారందిస్తున్న సహకారం, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో ఇదంతా సాధించాం. ఇది ముమ్మాటికీ సిద్దిపేట ప్రజల విజయం. జల్ హీ అమృత్ సర్వేలో నర్సాపూర్ ఎస్‌టీపీకి నాలుగు, చింతల్ చెరువుకు మూడు స్టార్ రేటింగ్స్ రావడం ఆనందంగా ఉంది. వచ్చిన నిధులను ఎస్‌టీపీల అభివృద్ధికి వినియోగిస్తాం.

- ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

దేశానికే రోల్‌మోడల్



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అందిస్తున్న సహకారం, సూచనలతోనే ఇదంతా సాధ్యమైంది. నిరంతరం సిద్దిపేట అభివృద్ధి కోసం పాటుపడుతూ సిద్దిపేటను అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలపడంతో పాటు, దేశానికే రోల్ మోడల్, దిక్సూచిగా నిలబెట్టడంలో ఆయనతో పాటు, అధికారులు, సిబ్బంది, కౌన్సిల్ పాత్ర అమోఘమైనది. జల్ హీ అమృత్‌లో సిద్దిపేట నర్సాపూర్‌కు నాలుగు స్టార్ రేటింగ్ పొందినందుకు గర్వంగా ఉంది.

- మంజులరాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్, సిద్దిపేట

'జల్ హీ అమృత్'లో తళుక్కుమన్న సిద్దిపేట

జల్ హీ అమృత్ సర్వేలో భాగంగా ఎస్‌టీపీల నిర్వహణపై ఇటీవల కేంద్ర బృందం సిద్దిపేటలో పర్యటించి చింతల్ చెరువు, నర్సాపూర్ చెరువు ఎస్‌టీపీలను సందర్శించింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి ప్రతిరోజు వెలువడుతున్న మురుగు నీటిని రెండు ఎస్‌టీపీలకు విభజించి శుద్ధి చేస్తున్న తీరును అడిగి తెలుసుకుంది. మురుగు నీరు శుద్ధి చేసిన తరువాత ఎస్‌టీపీలోని ల్యాబ్‌లో పీహెచ్ వాల్యూ, ఆసిడ్ లెవల్స్ పీవోడి, సీవోడి, కెమికల్, మెగ్నీషియం తదితర వంటి పరీక్షలు చేసిన తరువాతే శుద్ధి అయినట్లు నిర్ధారించుకున్నారు. సిద్దిపేట నర్సాపూర్ ఎస్‌టీపీ నిర్వహణ బాగుందని కితాబునిస్తూ నాలుగు స్టార్ రేటింగ్స్‌ను ఇచ్చారు. ఈ మేరకు ఇటీవలే కేంద్రం నుంచి రూ.2.50 కోట్ల పారితోషికాన్ని అందుకుని సిద్దిపేట మున్సిపల్ ఖాతాలో జమచేసుకున్నది.



పట్టణంలో యూజీడీ నిర్మాణం పూర్తి కావడంతో ఎండిపోయిన మురుగు కాలువ



నర్సాపూర్ ఎస్‌టీపీ ప్లాంటులోని ల్యాబ్‌లో శుద్ధి చేసిన నీటిని పరీక్షలు చేస్తున్న సిబ్బంది

'ప్రజావాణి'కి 54 దరఖాస్తులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 54 ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

రుణమాఫీ, రైతు భరోసా అందించాలి

రైతురుణమాఫీ, రైతు భరోసా ఇప్పటివరకు రైతులకు పూర్తిగా ప్రభుత్వం చెల్లించనందున రైతురక్షణ సమితి నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ములుగులో మట్టి మాఫియాను నియంత్రించాలి

ములుగు పరిధిలో మట్టిమాఫియాను నియంత్రించాలని ములుగు గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మట్టిమాఫియాపై ఎమ్మార్వో, ఎస్ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ చొరవ చూపి మాఫియాను నియంత్రించాలని కోరారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ముంపు గ్రామాల పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు వినతీపత్రాన్ని అందజేశారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల పరిధిలోని గ్రామపంచాయతీల ఖాతాలను మూసివేయడంతో నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు.

మల్లన్న ఆలయ ఈవోగా అన్నపూర్ణ

చేర్యాల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ఈవోగా ఎస్.అన్నపూర్ణ విధుల్లో చేరారు. సోమవారం మల్లన్నను దర్శించుకుని కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. గత జనవరిలో నియామకమైన రామాంజనేయులును ఇటీవల బదిలీ చేశారు. చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ అధికారిగా వ్యవహరిస్తున్న అన్నపూర్ణకు మల్లన్న ఆలయ ఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే మరో నాలుగు నెలల్లో ఆమె ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ క్రమంలో మల్లన్న ఆలయానికి బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ కమిషనర్ స్థాయి ఆలయమైనప్పటికీ రెగ్యులర్ ఈవోను కాకుండా మరోమారు అసిస్టెంట్ కమిషనర్‌స్థాయి అధికారిని నియమించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆలయాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడతానని ఆమె అభిప్రాయపడ్డారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అన్నపూర్ణ

మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నంగునూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను పేర్కొన్నారు. సోమవారం రాత్రి నంగునూరులో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డెన్ సెర్చ్‌లో 56 మోటార్ సైకిళ్లకు ఎలాంటి పేపర్లు లేవని గుర్తించినట్లు తెలిపారు. రూ.3వేల విలువైన గుట్కాలు, రూ.2,500 విలువైన లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వారెడ్డి, దుబ్బాక ఎస్ఐ గంగరాజు, మిరుదొడ్డి ఎస్ఐ పరశురామ్, ఆర్ ఎస్ఐ బాలకృష్ణ, సర్కిల్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.

బాలికతో వ్యభిచారం

- పోక్సో కేసు నమోదు
- వైద్య పరీక్షల కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- పోలీసుల కళ్లు గప్పి పారిపోయి...అమ్మమ్మ చెంతకు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను గుర్తు తెలియని ఓ మహిళ వ్యభిచారం రొంపిలోకి దింపింది. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో సదరు బాలికతో పనిచేయిస్తూ కొన్ని రోజులుగా వ్యభిచారం చేయిస్తోంది. హైదరాబాద్ లింగోజిగూడలోని ఓ ఎన్‌జీవో సభ్యులు ఈ విషయం తెలుసుకొని సదరు బాలికను వారి చెర నుంచి విడిపించారు. అనంతరం వారు ఈనెల 4న పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులకు గురైనట్లు ఎన్‌జీవో సభ్యులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పటాన్‌చెరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి బాలికను అదేరోజు సంగారెడ్డిలోని సఖీ కేంద్రానికి తరలించారు. అయితే ఈనెల 5, 6 తేదీల్లో ప్రభుత్వ సెలవులు రావడంతో 7న మధ్యాహ్నం వైద్య పరీక్షల నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పోలీసులు దరఖాస్తుఫారం నింపుతున్న క్రమంలో సదరు బాలిక భయభ్రాంతులకు గురై పోలీసుల కళ్లు గప్పి ఆసుపత్రి నుంచి పారిపోయింది. వెంటనే అప్రమత్తమైన సంగారెడ్డి పట్టణ పోలీసులు ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సదరు బాలిక ఒక్కతే బయటకు వెళ్లిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాలిక కోసం పోలీసులు గాలింపు చర్యలు చేడుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రికి సదరు బాలిక సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న ఆమె అమ్మమ్మ ఇంటికి క్షేమంగా చేరుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి తెలిపారు. బాలికతో వ్యభిచారం చేయిస్తున్న మహిళ ఎవరనే విషయాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

మీ వస్తువులను తీసుకెళ్లండి

- ఇంతకాలం తాత్కాలిక భవనంలో హుస్నాబాద్ అగ్నిమాపక కేంద్రం
- ఖాళీ చేయాలని యజమాని ఆదేశం
- ఆరుబయటే అగ్నిమాపక కేంద్రం సామాన్లు
- సొంత భవనం లేక అవస్థలు

హుస్నాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు హుటాహుటీన చేరుకుని మంటలను అదుపు చేసి సహాయ చర్యలు చేపట్టే హుస్నాబాద్ అగ్నిమాపక సిబ్బంది సమస్యలతో సతమతమవుతున్నారు. ఇంతకాలం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతుసేవా కేంద్ర భవనంలో తాత్కాలికంగా కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్ర సామగ్రిని తరలించాలని సంబంధిత యజమానులు చెప్పారు. దీంతో వస్తువులను ఆరుబయట ఉంచారు. మార్కెట్ యార్డు కూడా ధాన్యంతో నిండిపోయింది. ఈ సమయంలో సిబ్బంది ఎందులో ఉండాలి. వాటర్ టెండర్ ఎక్కడ పెట్టాలి. వీటికి సంబంధించిన వస్తువులకు ఎక్కడ భద్రపర్చాలని సమస్యలతో ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా హుస్నాబాద్ అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం లేకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



ఆరుబయట వేసిన అగ్నిమాపక కేంద్రం వస్తువులు

రెండేళ్ల క్రితం శంకుస్థాపన..

అగ్నిమాపక కేంద్ర భవనానికి హుస్నాబాద్ మార్కెట్ యార్డులోని 10 గుంటల స్థలం కేటాయించి రూ. 1.25 కోట్లు మంజూరు చేసి డిసెంబరు 2022న శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అయితే పది గుంటల స్థలం దీనికి సరిపోదని, 30 గుంటలు కేటాయించాలని అగ్నిమాపక అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో ధాన్యం పేరకపోవడంతో భవనం నిర్మించే వరకు ఖాళీగా ఉన్న వేరే అనువైన ప్రభుత్వ భవనం కేటాయించాల్సిన అవశ్యకత ఏర్పడింది.



మార్కెట్ యార్డులోని అగ్నిమాపక కేంద్రం వద్ద సిబ్బంది

సంగారెడ్డిలో దొంగల హల్‌చల్

- వ్యాపార కేంద్రాలే లక్ష్యంగా చోరీలు
- 20 రోజుల్లో ఆరు దుకాణాల్లో నగదు అపహరణ
- తాజాగా రైస్‌మిల్లులో రూ.2 లక్షలు
- మెడికల్‌షాపులో రూ.50 వేలు చోరీ

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మూసి ఉంచిన వ్యాపార దుకాణాలనే లక్ష్యంగా చేసుకుని దోచుకెళ్తున్నారు. ఎక్కువగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలే ఎంచుకుంటున్నారు. నిత్యం పోలీస్ పెట్రోలింగ్, సీసీ కెమెరాల నిఘా ఉండే జిల్లా కేంద్రంలోనే 20 రోజులుగా ఆరు చోట్ల దొంగతనాలకు పాల్పడినా పోలీసులు నిందితులను పట్టుకోవడంలో విఫలమయ్యారు. నిఘా వ్యవస్థ నిద్రపోతుందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ఐబీ ఎదురుగా ఉన్న సంతోష్ మెడికల్ దుకాణాలో చోరీ జరిగింది. మెడికల్ షాప్ షట్టర్‌ను పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు రూ.50వేల నగదును అపహరించారు. అలాగే శిల్పారామం సమీపంలో ఉన్న రాజయ్య రైస్ మిల్లులో రూ.2లక్షల నగదు దోచుకెళ్లారు.

నిఘా వ్యవస్థ ఏం చేస్తుంది?

సంగారెడ్డి పట్టణంలోనే 20 రోజులుగా వ్యాపార కేంద్రాల్లో దొంగతనాలు జరుగుతున్నా నిఘా వ్యవస్థ ఏం చేస్తుందని వ్యాపారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల్లో చోరీలు జరుగుతుంటే పోలీసులు ఇంకా దొంగలను పట్టుకోకపోవడం చూస్తుంటే వారి నిఘా వ్యవస్థ ఏం చేస్తుందని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు అప్రమత్తత చర్యలేమి కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దొంగల దృశ్యాలు సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపిస్తున్నా పట్టుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే నిఘా విభాగం ఇంత ఘోరంగా విఫలమైతే మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటని అంటున్నారు. దుకాణాలకు తాళం వేసి ఇంటికి వెళ్లాలంటేనే జంకుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వ్యాపార కేంద్రాలనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే దొంగలను పట్టుకోవాలని వ్యాపారవర్గాలు పోలీసులను కోరుతున్నారు.

సరాఫ్‌పల్లిలో తాళం పగులగొట్టి ఓ ఇంట్లో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ



బీరువాలోని బట్టలను చిందరవందరగా పడవేసిన దుండగులు

పుల్‌కల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన వంజరి స్వాతికి చెందిన ఇంట్లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సంతోష్ భార్య పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నారు. కుటుంబ సభ్యులందరూ ఆదివారం సాయంత్రం హత్నూర మండలం మాదారం దత్తాత్రేయ స్వామి ఆలయానికి దైవదర్శనానికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన సంతోష్ సోమవారం ఉదయం 6.30 గంటలకు ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి కనపడింది. బీరువాలో దాచి ఉంచిన తులం బంగారం నగలు, 20 తులాల వెండి పట్టీలు, రూ.20 వేలు నగదును ఎత్తుకు వెళ్లారు. బాధితుల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంగారెడ్డి నుంచి క్లూస్ టీంను రప్పించి, ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండా రైల్వేగేటు సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్నది. కామారెడ్డి రైల్వే పోలీసుల వివరాలు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మర్చ్యురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని రైల్వే పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ హనుమాండ్లుగౌడ్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్‌లోని చైతన్యపురికాలనీలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణ పరిధిలోని చైతన్యపురిలో నివసించే ఎం.వెంకటేశ్(45) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య తాగుడుకు బానిసవడంతో తరచూ కుటుంబీకులతో గొడవపడుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి బాగా మద్యం సేవించి కుటుంబీకులతో గొడవ పడ్డాడు. కుటుంబీకులు తాగిన మత్తులో ఉన్న వెంకటేశ్‌కు నచ్చచెప్పి పడుకోబెట్టారు. సోమవారం తెల్లవారుజామున ఆరు గంటల ప్రాంతంలో గదిలోకి వెళ్లిచూడగా ఇంట్లో తాడుతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

నర్సాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి ఫిట్స్ రావడంతో పొలంలోనే మృతిచెందిన సంఘటన నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తుంపేటకు చెందిన కర్రె కిష్టయ్య కొడుకు అనిల్(26) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు తరచూ వచ్చే ఫిట్స్‌తో కొన్నిరోజులుగా బాధపడుతున్నాడు. 5వ తేదీన కూలి పని కోసమని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా అనిల్ ఇంటికి రాలేదు. మరుసటి రోజు కూడా కనిపించకపోవడంతో అంతటా వెతుకుతుండగా సాయంత్రం గ్రామ శివారులోని పొలంలో ఫిట్స్‌తో పడిపోయి చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

నగదు, రెండు బైక్‌లు స్వాధీనం



అరెస్టు చేసిన ఐదుగురు నిందితులను చూపుతున్న పోలీసులు

ములుగు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను సోమవారం కొట్యాల గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొట్యాల శివారులో యువకులు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై అక్కడికి చేరుకున్నారు. ఐదుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి 920 గ్రాముల గంజాయి, రూ.33 వేలు, 2 ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

120 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో ఇద్దరు



పోలీసులు అదుపులో ఎండు గంజాయిని రవాణా చేస్తున్న నిందితులు

మునిపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్న 120 గ్రాముల ఎండు గంజాయిని సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు స్కూటీపై రవాణా చేస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం తెలిసింది. దీంతో కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరిపై అనుమానం రావడంతో వారిని ఆపి తనిఖీ చేయగా అందులో 120 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితులు మహ్మద్ ఆయూబ్ అలీ, షేక్ సమీర్‌ను విచారించగా బీదర్‌కు చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

100కు ఫోన్‌కాల్..
నిలిచిన వివాహం

- వధువు మైనర్ అంటూ గుర్తుతెలియని వ్యక్తుల ఫిర్యాదు
- పోలీసులతో మాట్లాడుతుండగా వధువుకు ఫిట్స్
- పెళ్లి వద్దంటూ వెళ్లిపోయిన వరుడు

కల్హేర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల వారు వచ్చారు. విందు భోజనాలు సిద్ధమయ్యాయి. మరికాసేపట్లో వధూవరులు పెళ్లి పీటలు ఎక్కడమే తరువాయి.. ఇంతలోనే పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సీన్ మారిపోయింది. పోలీసుల గండం గట్టెక్కిందనుకునే సమయంలో వరుడు ససేమిరా అనడంతో వివాహం కాస్త ఆగిపోయింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. మండలంలోని ఓ తండాకు చెందిన యువతితో సిర్గాపూర్ మండల పరిధిలోని మరో తండాకు చెందిన యువకుడితో వివాహం జరిపించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరికొన్ని గంటల్లో వివాహం జరగనుండగా, గుర్తు తెలియని వ్యక్తులు 100 నంబర్‌కు కాల్ చేసి మైనర్‌కు వివాహం చేస్తున్నారని చెప్పారు. దీంతో కల్హేర్ పోలీసులు ఆదివారం రాత్రి తండాకు వచ్చి వివరాలు సేకరించారు. అయినా, కుటుంబ సభ్యులు వివాహం చేసేందుకు సిద్ధం కాగా, మరోసారి పోలీసులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో పోలీసులు వచ్చి వధువు పదో తరగతి సర్టిఫికెట్ పరిశీలించగా, అందులో ఆమె వయస్సు 18 ఏళ్లపై బడి ఉంది. దీంతో పోలీసులు వధువుకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించే క్రమంలో ఆమెకు పూనకం వచ్చినట్లు ఊగిపోవడంతో పాటు కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో వరుడితో పాటు అతని బంధువులు పెళ్లి వద్దంటూ వెళ్లిపోయారు. దీంతో వధువు తరఫు కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

మహిళా శక్తికి సాంకేతికత తోడైతే సమాజాభివృద్ధి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా శక్తికి సాంకేతికత తోడైతే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో హెటిరో, సింక్రో ఫ్లయింగ్ వెడ్జ్ పరిశ్రమల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టెక్నాలజీ పరంగా అవగాహన కలిగి ఉంటే మహిళలకు, స్వయం సంఘాల సభ్యులకు సాధికారత కల్పించవచ్చన్నారు. వ్యవసాయ, ఉద్యాన సేవల కోసం డ్రోన్‌లు అందజేయాలన్నారు. దీని ద్వారా ఆర్థిక సాధికారిత, స్థిరమైన జీవనోపాధికి దోహదపడుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. డ్రోన్ శిక్షణను రాష్ట్ర స్థాయిలో మొదటిసారి సంగారెడ్డి జిల్లాలోనే ప్రారంభించుకున్నామన్నారు. ఈ శిక్షణను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మహిళలకు డ్రోన్‌ల కోసం బ్యాంకుల నుంచి లేదా శ్రీనిధి ద్వారా రుణాలు అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, హెటిరో, సింక్రో సర్వీస్, ఎరోస్పేస్ ప్రతినిధులు సుధాకర్, నరసింహా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అనంతసాగర్ రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

రోడ్లపైనే కల్లాలు

వ్యవసాయాధికారులు, పోలీసుశాఖ ఎన్ని చర్యలు తీసుకున్నా యాసంగి వరి ధాన్యం రోడ్లపైకి రానే వచ్చింది. మండలంలోని మక్కరాజుపేట, రుక్మాపూర్ అనంతసాగర్, బోనాల, కర్నాల్‌పల్లి నుంచి దౌల్తాబాద్ వరకు రోడ్లపైనే కల్లాల ఏర్పాటుతో గతంలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మండలంలోని రైతులకు మూడు నెలల ముందే రైతు వేదికల్లో అవగాహన కల్పించారు. అయినా, రైతులు యథావిధిగా రోడ్లపైనే వడ్లను ఆరబెడుతున్నారు.

చేగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)

ఇలాగైతే వెళ్లేదెలా?

నాగులపల్లిలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

ఈదులనాగులపల్లి - వెలిమెల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రమాదకరంగా ఉన్న ఓఆర్ఆర్ ర్యాంపు రోడ్డే దిక్కు


నాగులపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి

రామచంద్రాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈదులనాగులపల్లి నుంచి పటాన్‌చెరు వెళ్లే మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో కొన్నిరోజులుగా ఈ మార్గంలో రాకపోకలకు స్థానికులకు తలనొప్పులు తప్పడం లేదు. ఈ బ్రిడ్జి పనుల కారణంగా మార్చి 8న ఈ ప్రాంతంలోని రైల్వే గేట్‌ను కూడా మూసి వేశారు. మొదటగా పది రోజుల పాటు మాత్రమే మూసివేస్తామంటూ రైల్వే అధికారులు చెప్పగా, నెల రోజులవుతున్నా తెరవడంలేదు. పక్క గ్రామమైన వెలిమెల నుంచి పటాన్‌చెరు వెళ్లడానికి కష్టాలు తప్పడం లేదు. వాహనాలు వెళ్లేందుకు ఓఆర్ఆర్ నాగులపల్లి వద్ద ఉన్న ర్యాంప్ రోడ్డే దిక్కుగా మారింది. గతుకులతో ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుపైనే వెళ్లక తప్పకపోవడంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలెత్తిపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఒకే ర్యాంపు రోడ్డు ఉండగా, రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.


గతుకులమయంగా ఓఆర్ఆర్ ర్యాంప్ రోడ్డు

కొల్లూరుకు బస్సు బంద్



రైల్వే గేట్‌ను మూసివేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు రోడ్డు వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొల్లూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు రావడం లేదు. పరిస్థితి తీవ్రత అధికారులకు అర్థమవ్వడం లేదు.

\- ప్రవీణ్, వెలిమెల

ర్యాంపు రోడ్డుపై ప్రయాణం నరకమే



ఓఆర్ఆర్ ర్యాంపు రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. రెండు వాహనాలు ఒకేసారి ర్యాంపుపైకి చేరుకుంటే ట్రాఫిక్ జాం అవుతుంది. మట్టి జారీ ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

\- దయాకర్, వెలిమెల

భారీ ర్యాలీతో ప్రమాణస్వీకారానికి

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయం సాధించిన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రామచంద్రాపురం పట్టణం నుంచి భారీ ఎత్తున బీజేపీ కార్యకర్తలతో నగరంలోని అసెంబ్లీకి తరలివెళ్లారు. గన్‌పార్క్ వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఆకాంక్షలకు అనుగుణంగా శాసనమండలిలో వ్యవహరిస్తానని తెలిపారు. ఆయనతో పాటు సతీమణి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, నాయకులు తదితరులు ఉన్నారు. అంజిరెడ్డికి కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు.


గన్‌పార్క్ వద్ద నినాదాలు చేస్తున్న అంజిరెడ్డి, బీజేపీ నాయకులు

యాదగిరిగుట్టలా కేతకీని అభివృద్ధి చేస్తా

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్
- సంగమేశ్వర ఆలయ చైర్మన్‌గా చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం



కేతకీలో ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ, సంవిధాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

ఝరాసంగం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట తరహాలో కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు ఎంపీకి వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్‌గా చంద్రశేఖర్, 11 మంది కమిటీ సభ్యులతో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ ఆలయానికి రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారన్నారు. ఆలయాభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని నూతన కమిటీకి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, జడ్పీ మాజీ చైర్మన్ సునితాపాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, ఆలయ ఈవో శివ రుద్రప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత అందరిదీ


నారాయణఖేడ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో ప్రమాదంలో పడ్డ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పైడిపల్లిలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్‌లో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలు, కులాలకు చెందిన పార్టీ అన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన, రాజ్యాంగాన్ని రచించిన మహాత్ములపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌తో పాటు ఆయన రచించిన రాజ్యాంగంపై చేసిన ఆరోపణలే అందుకు నిదర్శనమన్నారు. జగన్నాథ్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధనలక్ష్మి, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్‌షెట్కార్, తాహేర్ అలీ, వినోద్‌పాటిల్, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- పిస్టల్, 35 బుల్లెట్లు, ద్విచక్రవాహనం స్వాధీనం
- గజ్వేల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచిన పోలీసులు


నిందితులను, స్వాధీనం చేసుకున్న పిస్టల్, బుల్లెట్లను చూపుతున్న గౌరారం పోలీసులు

వర్గల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులు శ్రీరామనవమి ఉత్సవాల బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పిస్టల్‌తో పాటు బుల్లెట్లు, ద్విచక్రవాహనం, పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం నాస్కల్ గ్రామం, ప్రస్తుతం బాలాజీనగర్‌లో నివాసముంటున్న మహ్మద్ ఎంఢీజాజ్(22), సికింద్రాబాద్‌లోని నెరేడ్‌మెట్ ప్రాంతంలో నివాసముంటున్న మహ్మద్ హిధాయత్ అలీ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలాజీనగర్‌కు చెందిన మద్దూర్ లాలు వీరు ముగ్గురు ఒక గ్రూపుగా ఏర్పాటై చోరీలకు పాల్పడటానికి పన్నాగం పన్నుతున్నారు. కాగా, ఆదివారం రాత్రి 8.00 గంటల ప్రాంతంలో వర్గల్ గ్రామంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. శ్రీరామనవమి బందోబస్తు నిర్వహిస్తున్న గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, పోలీసు సిబ్బందిని చూసి వారు పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంట పడి పట్టుకున్నారు. మహ్మద్ ఎంఢీజాజ్, మహ్మద్ హిధాయత్ వారి వద్ద ఉన్న బ్లాక్ కలర్ బ్యాగ్‌ను తనిఖీ చేయడంతో అందులో ఒక పిస్టల్, 35 బుల్లెట్లు, రెండు మొబైల్‌ఫోన్‌లు, నిజమైన ఆధార్‌కార్డులు, నకిలీ ఆధార్‌కార్డులు, డెబిట్ కార్డులు, మెమొరీ కార్డులు, ఎయిర్‌టెల్ సీమ్ కార్డులు, నకిలీ డస్టర్లు, పెప్పర్ స్ప్రే నాలుగు బాటిళ్లు లభించాయి. ఇద్దరు వ్యక్తులను పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి విచారించగా ఎంఢీజాజ్, మద్దూర్ లాల్ వీరు ఇద్దరు ఆస్తి నేరాలు, చైన్‌స్నాచింగ్, దోపిడీ, బైక్‌ల దొంగతనాలకు పాల్పడాటానికి కుట్రలు చేశారని తెలిపారు. వీరు ఇద్దరు బీహార్ రాష్ట్రంలోని ముంగర్ పట్టణానికి వెళ్లి పిస్టోల్, 38 బుల్లెట్లు కొనుగోలు చేశారని, అందులో జవహర్‌నగర్ అడవి ప్రాంతంలో ఒక రౌండ్ షూటింగ్ ప్రాక్టీస్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 2 నుంచి 5 వరకు ఎంఢీజాజ్, హిధాయత్ అలీ సికింద్రాబాద్‌లోని హోటల్ సుప్రబాత్‌లో ఉండి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆస్తి నేరాలు చేయడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ఆదివారం వీరిద్దరు దోపిడీ చేయడం కోసం వర్గల్ గ్రామానికి రాగా పట్టుబడ్డారు. మూడో వ్యక్తి మద్దూర్ లాలును బాలాజీనగర్ ఆర్మీ డెంటల్ కాళాశాల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం గజ్వేల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.



బెజ్జంకి జాతర పండుగొచ్చే..


వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఏకశిల గుట్ట.. నేడు లక్ష్మీనర్సింహుడి కల్యాణం


కాకతీయుల కాలంలో నిర్మించిన లక్ష్మీనృసింహుడి ఆలయంలోని స్తంభాలు

బెజ్జంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకిలో ఏకశిల గుట్టపై లక్ష్మీసమేతుడుగా కొలువుదీరిన నృసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. చైత్రశుద్ధ సప్తమి నుంచి బహుళ సప్తమి వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. కాకతీయుల కాలంలో రాతి కట్టడంతో నిర్మించిన ఈ ఆలయంలో స్వామివారు దక్షిణ ముఖంగా స్వయంభుగా వెలిశారు. సంతానం లేని వారికి గుట్టపైన ఉన్న ఆండాల్ రాతి స్తంభానికి ఒడిబియ్యం పోసి, ముడుపు కడితే సంతానం కల్గుతుందని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన శ్రీలక్ష్మీసమేత నృసింహ స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఏకశిల గుట్ట చుట్టూ తిరిగే ఎడ్ల బండ్ల ఊరేగింపు (శకటోత్సవం) 12న, చివరి ప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుకలు 13న కొనసాగనున్నాయి.

కనులపండువగా
జోగినాథుని రథోత్సవం

జోగిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలో సోమవారం రాత్రి జోగినాథస్వామి రథోత్సవం కనులపండుగగా నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయానికి ఆలయ కమిటీ చైర్మన్ డాకూరి శివశంకర్‌తో అర్చకులు భద్రయ్య స్వామి, సుజీత్ ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, హారతినిచ్చి ప్రారంభింపజేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం పూజారులు రథం ముందు పట్నం ముగ్గు వేసి అన్నరతి పెట్టారు. వివిధ కులవృత్తుల వారితో కార్యక్రమాలు జరిపించారు. జంగమ పూజారులైన సోమప్పస్వామి, సుజీత్‌స్వామి తదితరులు రాగయుక్తంగా ఆడుతూ, వీరన్న ప్రస్థాయం గానం చేశారు. జోగినాథస్వామికి జై, ఓంనమఃశివాయ, హరహరమహాదేవ అంటూ వేలాదిమంది భక్తులు రథాన్ని తాళ్లతో లాగారు. గౌనిచౌరస్తా నుంచి ప్రారంభమైన రథం పోచమ్మ ఆలయం, పోచమ్మ వీధుల గుండా జోగినాథ కూడలి వద్దకు చేరుకునే సరికి అర్ధరాత్రి దాటింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రథత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ డీబీ. నాగభూషణం, మాజీ ఎంపీటీసీ శివశేఖర్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


విద్యుత్‌కాంతులలో రథం


నర్మెట్ట గ్రామంలో ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

ప్రైవేటు స్థలమే క్రీడా మైదానం

గ్రామాల్లో అలంకారప్రాయంగా ప్రభుత్వ క్రీడా మైదానాలు

నంగునూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు అలంకారప్రాయంగా మారాయి. కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఈ క్రీడా మైదానాలను కొన్నిచోట్ల ఊరికి దూరంగా మరికొన్ని చోట్ల శ్మశానవాటికల పక్కనే ఏర్పాటు చేయడంతో అటువైపు యువత కన్నెత్తి చూడడం లేదు. మరికొన్ని గ్రామాల్లో గుట్టలు, రాళ్ల మధ్య ఏర్పాటు చేశారు. దీంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువత ప్రైవేటు ప్లాట్లు, భూములను మైదానాలుగా మార్చుకొని ఆడుకుంటున్నారు. గ్రామాల్లో పండుగలు, సెలవులు వచ్చిందంటే ఊరి బయటకు వెళ్లి ఖాళీ స్థలం ఎక్కడ ఉంటే అక్కడ వికెట్లు పెట్టుకొని క్రికెట్ ఆడడం ప్రతీ గ్రామంలో కనిపిస్తుంది. నాలుగైదు గ్రామాల క్రీడాకారులు ఒక దగ్గర చేరి క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతున్నారు. తుమ్మ చెట్లు, పొదలు, చెత్త పేరుకుపోయిన క్రీడా మైదానాలను చదును చేయించి కనీస వసతులు కల్పించాలని యువత కోరుతున్నారు.

ప్రోత్సహిస్తే రాణిస్తాం



క్రీడాకారులను ప్రోత్సహించి కనీస వసతులు కల్పిస్తే రాణిస్తాం. కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల టాలెంట్ ఉన్నప్పటికీ గుర్తింపు పొందలేకపోతున్నాం. ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను గుర్తించాలి.

\- మోతకని శేఖర్, నర్మెట్ట

ఆరోగ్య కేంద్రానికి సుస్తీ

- శిథిలావస్థలో నారాయణరావుపేట పీహెచ్‌సీ
- చిన్న వర్షానికే స్లాబ్ నుంచి కారుతున్న నీరు
- పెచ్చులూడిన స్లాబ్ నుంచి ఇనుప చువ్వలు బయటకు..
- ప్రసవాలకు సిద్దిపేట ఆసుపత్రికి వెళ్లాల్సిందే
- నూతన భవనం నిర్మించాలని డిమాండ్


నారాయణరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


అవుట్ పేషంట్, ప్రసూతి గదుల్లో తేమతో పెచ్చులూడుతున్న స్లాబ్, వేలాడుతున్న విద్యుత్ స్విచ్ బోర్డు

సిద్దిపేట రూరల్,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకొని, స్లాబ్ పెచ్చులూడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణరావుపేట మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 20 గ్రామాల్లో 7 ఆరోగ్య ఉప కేంద్రాలతో 3 మండలాల పరిధిలో సేవలు అందిస్తుంది. అయితే ఎలాంటి మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. చిన్న పాటి చినుకులు పడితే చాలు స్లాబ్ నుంచి వర్షం నీరు కారుతుంది. ముఖ్యమైన గదుల్లోనే స్లాబ్ బయటకు పొక్కి ఉండడంతో ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయేమోనని సిబ్బంది, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

నిధులొచ్చినా.. పట్టించుకునేవారేరీ?

ఆరోగ్య కేంద్రం మరమ్మతుల నిమిత్తం గత ప్రభుత్వం సుమారు రూ.35 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కల్పించాల్సిన సౌకర్యాలు, వసతులు, ఇతర సమస్యలపై అధ్యయనం చేసి చర్చించాల్సిన అభివృద్ధి కమిటీల సమావేశం ఏళ్లు గడిచినా ఆ ఊసే లేకుండా పోయింది. సంబంధిత ఉన్నతాధికారులు సైతం నామమాత్రంగా సందర్శించడం తప్ప ఆరోగ్యకేంద్రం పురోగతిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చిన్న వర్షానికే పెచ్చులూడుతున్న స్లాబ్..

నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం చిన్నపాటి వర్షం కురిస్తే చాలు స్లాబ్ పెచ్చులూడిపోతుంది. కొన్ని చోట్ల పెచ్చులూడి స్లాబ్ లోపలి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. అంతేకాకుండా విద్యుత్ సరాఫరా అయ్యే స్విచ్ బోర్డులు సైతం ఊడిపోతున్నాయి. ముఖ్యంగా అవుట్ పేషంట్ గది, ప్రసూతి గది, ఫార్మసీ గదితో పాటు గోడలు సైతం వర్షానికి తడిసి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రోగులు ఓపీ గదిలో ట్రీట్‌మెంట్ తీసుకునేందుకు జంకుతున్నారు.

ప్రసవాలు బంద్..

ప్రసూతి గదిలో పెచ్చులుడేందుకు సిద్ధంగా ఉండడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు చేయడం మానేశారు. ప్రసవం కోసం వచ్చే గర్భిణులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా జరిపించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వినియోగించకపోవడంతో భవనం పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలి.

- పొన్నాల బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు, నారాయణరావుపేట

కాంట్రాక్టర్ అర్ధాంతరంగా వదిలేశాడు



గత ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం భవన మరమ్మతులకు నిధులు మంజూరు చేసినప్పటికీ, కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. ప్రసూతి గది, ఓపీ గదిలో పెచ్చులూడుతున్నాయి. దీంతో ఇక్కడ ప్రసవాలు చేయడం లేదు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్నాం. ఆరోగ్య కేంద్రంలో ఇబ్బందుల గురించి గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి కమిటీ సూచనలు తీసుకుంటాం.

- బాపురెడ్డి, మెడికల్ ఆఫీసర్, నారాయణరావుపేట

ఆరోగ్యకర దినచర్యను అలవాటు చేసుకోవాలి

● జిల్లాలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, నంగునూరు మండలం రాజగోపాల్ పేటలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న సురభి ఆసుపత్రి వైద్యులు

గజ్వేల్/ మద్దూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర దినచర్యను అలవాటు చేసుకోవాలని సూచించారు. మానవ జీవితంలో దినచర్య క్రియాశీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరిండెంట్ స్వరూపరాణి, డ్యూటీ డాక్టర్ నవ్యారావు, డాక్టర్లు తర్జని, హెడ్ నర్సు విజయలక్ష్మి, శారద, జగదాంబ, రోజులిన్, ల్యాబ్ టెక్నీషియన్స్ తదితరులున్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలోని పల్లె దవాఖానా ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సువర్ధనన్ మాట్లాడారు. ప్రసూతి, నవజాత శిశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశాలు, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ ఉన్నారు.

● **నంగునూరు:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలో సురబి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పీఆర్‌వో పరశురాములు మాట్లాడుతూ.. పేదలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజేందర్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాక్టర్‌లో లోడ్ చేసిన ఆయిల్‌పామ్ గెలలను చూపుతున్న రైతు

ఆయిల్ పామ్‌తో రైతుల కష్టాలు గట్టెక్కాయి

మర్కుక్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతుల కష్టాలు గట్టెక్కాయని, ఇక వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పినట్టేనని మండల వ్యవసాయ అధికారి వసంతరావు పేర్కొన్నారు. సోమవారం పాములపర్తి గ్రామంలో సర్వే సత్యనారాయణ, సునీత రైతుల ఆయిల్ పామ్ తోటలో గెలలు కోత ప్రారంభించగా, సుమారు మూడు టన్నుల వరకు గెలలు కోసి వాటిని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో గల ఆయిల్ ఫ్యాక్టరీకి పంపించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజినీకాంత్, ఆయిల్ ఫీడ్ అధికారి విజయ్, రైతులు స్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి


మల్లయ్య(ఫైల్)

నంగునూరు, ఏప్రిల్ 7 :(ఆంధ్రజ్యోతి)సిద్దిపేట కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే పంగ మల్లయ్య సోమవారం గుండెపోటుతో మరణించారు. మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన పంగ మల్లయ్య వీఆర్ఏగా పని చేస్తూ ఇటీవల జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాడు. సోమవారం ఉదయం పాలమాకులలోని తన ఇంటి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఆకస్మాత్తుగా ఛాతి నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య గీత, ఇద్దరు కుమారులు నిఖిలేష్ (9), విద్యాదీప్(8) ఉన్నారు. మల్లయ్య అంత్యక్రియల నిమిత్తం కలెక్టరేట్ కు చెందిన అధికారులు రూ.20 వేలు అందజేశారు.

విద్యార్థి కుటుంబానికి అండగా టీచర్


విద్యార్థి తండ్రికి చెక్కును అందజేస్తున్న టీచర్ లావణ్య

మర్కుక్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తికి చెందిన పెద్దబోయిన వంశీ అనే పదో తరగతి విద్యార్థితో పాటు అతడి సోదరి దివ్య నాలుగు రోజుల క్రితం ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం లక్ష్మక్కపల్లిలో గల ఆర్వీఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు పాల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నారు. ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. వంశీ తండ్రి దాతల నుంచి సహాయాన్ని కోరుతూ విద్యార్థి చదువుతున్న జడ్పీ ఉన్నత పాఠశాల పాములపర్తి ఉపాధ్యాయులను వేడుకోగా తెలుగు ఉపాధ్యాయురాలు లావణ్య చలించి అమెరికాలో ఉన్న తన సోదరి సౌజన్యకు సమాచారమందించింది. ఆమె వెంటనే రూ.40 వేల నగదును అందజేశారు. వారి స్నేహితులతో కలిసి రూ.1.53 లక్షలను శుక్రవారం బాధిత విద్యార్థి తండ్రికి అందజేశారు. కాగా లావణ్య అత్తకు ఈ విషయం తెలుపగా, ఆమె తన పెన్షన్ నుంచి రూ. వెయ్యి అందజేశారు.

జ్యోతిబాపూలే జయంతిని విజయవంతం చేద్దాం

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న హుస్నాబాద్‌లో నిర్వహించనున్న జ్యోతిబాపూలే జయంతిని విజయవంతం చేయాలని బీసీసంఘం నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జ్యోతిబాపూలే జయంతి నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, వడ్డెపల్లి మల్లేశం, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్‌లో జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సమావేశమైంది.

ఏఐతో విద్యాబోధన సులభం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐతో) విద్యార్థులకు బోధన చేయడం ద్వారా పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని మాస్టర్ మైండ్ పాఠశాల కరస్పాండెంట్ పట్లోళ్ల రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ ప్రైవేట్ పాఠశాలలో ఎడిస్ సాఫ్ట్‌వేర్ నిపుణుడితో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులకు ఏఐ ద్వారా వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొట్టమొదటగా ఈ ప్రాంతంలో 6వ తరగతి నుంచి ఐఐటీ, నీట్, జేఈఈ విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ బుద్ధ నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

గజ్వేల్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు

గజ్వేల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు పునఃప్రారంభమయ్యాయని గజ్వేల్ పోస్టుమాస్టర్ వెంకటగణేశ్ తెలిపారు. ఏడాది కాలంగా నిలిచిపోయిన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ 20 నుంచి 25 మందికి సేవలు అందుబాటులో ఉంటాయని, గజ్వేల్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన సోమేశ్వర్‌రెడ్డి



మిరుదొడ్డి,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి):అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన రాష్ట్ర పీసీసీ సభ్యుడు మద్దుల సోమేశ్వర్ రెడ్డి సోమవారం పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి


గజ్వేల్: అహ్మదీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్/గజ్వేల్/అక్కన్నపేట/కోహెడ/ జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఆయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వెంట ఏఎంసీ కార్యదర్శి వెంకటయ్య, అకౌంటెంట్ సురేశ్, రైతులు ఉన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి, అహ్మదీపూర్, జాలిగామ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డిలతో కలసి సోమవారం ప్రారంభించారు. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి, నందారం, ధర్మారం, మంచినీళ్లబండ గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, కోహెడ మండలంలోని నాగ సముద్రాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజు పారంభించారు. జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి, మునిగడప గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి ప్రారంభించారు.

సన్నబియ్యం పంపిణీతో పేద కుటుంబాల్లో సంతోషం: తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకంతో పేద కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ గ్రామంలోని దళితవాడలో అయ్యగాల్ల యాదగిరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన వంటను భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి పథకం అమలు చేసినా అది పేదల సంక్షేమానికి ఉపయోగపడుతుందన్నారు. వర్గల్ తన సొంత గ్రామమని, తనకు రాజకీయ జన్మనిచ్చిన గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం తన కర్తవ్యమన్నారు. ఇక్కడి ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, నాయకులు మోహన్, ప్రవీణ్‌గౌడ్, ప్రభుగౌడ్, సందీప్ రెడ్డి, సాయిగౌడ్, శివరాములతో పాటు తదితరులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రను తిప్పికొట్టాలి

● గ్రామాల్లో కాంగ్రెస్ సంవిధాన్ పాదయాత్ర


వర్గల్‌లో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర


మద్దూరు: నర్సాయపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

వర్గల్/ మర్కుక్/ మద్దూరు/కోహెడ/చేర్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందని, వారి కుట్రను తిప్పికొట్టవలసిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపూ జైభీమ్ జైసంవిధాన్ పేరిట పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కదలాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. వర్గల్, గౌరారం గ్రామాల్లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి జైబాపూ జైభీమ్ జైసంవిధాన్ నినాదంతో పాదయాత్ర చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. అనంతరం మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సందీప్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సాయిగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు. మర్కుక్ మండలంలో పాములపర్తి, పాతూరు గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్రలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాంగ పరిరక్షణకు ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మద్దూరు మండలంలోని నర్సాయపల్లి, గాగిల్లాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఆలేటి సిద్దిరాములు చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మండల అధ్యక్షులు మేక మల్లేశం, జిల్లా నాయకులతో కలిసి సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోహెడ మండలంలోని నాగ సముద్రాల, ఆరేపల్లి, పోరెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. చేర్యాల మండలంలోని వీరన్నపేట, ముస్త్యాల, చుంచనకోటతో పాటు కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించాయి.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 27 మందికి జరిమానా.. ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారిని పోలీసులు సోమవారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా జరిమానా విధిస్తూ న్యాయాధికారులు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను నిర్వహించగా 13 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా నిందితులకు రూ.25,500 జరిమానా విధించారు. వారిలో ఒకరికి 3రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 14 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట కోర్టులో హాజరు పరచగా రూ.7,700 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గజ్వేల్‌లో మహిళ అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని పటేల్‌బజార్‌కు చెందిన కుడుముల నర్సింలు, భాగ్యలక్ష్మి(43) దంపతులకు కొడుకు, కూతురు సంతానం. తల్లి భాగ్యలక్ష్మి మాటలను కొడుకు పవన్ వినడం లేదనే కోపంతో ఆదివారం ఇంట్లో నుంచి సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు తీసుకొని వెళ్లే క్రమంలో తల్లి భాగ్యలక్ష్మిని కూతురు ఆపే ప్రయత్నం చేసినా వినకుండా వెళ్లిపోయింది. అంతకు ముందురోజే వెంకటరత్నాపూర్‌కు వెళ్లిన భర్త నర్సింలుకు అల్లుడు అనిల్ ఫోన్ ద్వారా సమాచారమందించాడు. నర్సింలు ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నేరచరితులకు సీఐ కౌన్సెలింగ్


చేర్యాల సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ

చేర్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల సర్కిల్ పోలీస్‌స్టేషన్ కార్యాలయ పరిధిలోని కేడీ, డీసీ, రౌడీసస్పెక్ట్‌లకు సోమవారం చేర్యాల సీఐ ఎల్. శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరచరితను రూపుమాపుకునేవిధంగా సత్ప్రవర్తనతో మెదలాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న స్వయంఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, సత్ప్రవర్తన కలిగినవారికి పోలీసు సహాయసహకారాలు తప్పక ఉంటాయన్నారు. కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు ఎస్ఐలు నీరేశ్, షేక్ మహబూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


సమావేశంలో మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల నాయకులు

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలలోని విద్యార్థినీ విద్యార్థులను ఉన్నత చదువులు చదివేల ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా షెడ్యూల్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ పనిచేస్తుందని సొసైటీ అధ్యక్షుడు మహంకాళి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సొసైటీ సభ్యులు రాములుతో కలిసి మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి సొసైటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహం అందిస్తున్నట్టు తెలిపారు. అంబేడ్కర్ జయంతి రోజున ఈ పురస్కారాలను అందజేయనున్నట్టు తెలిపారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అన్ని వర్గాల ఎస్సీ విద్యార్థులు ఈ నెల 10 తేదీలోపు సొసైటీ సభ్యులను సంప్రదించాలని లేదా 9440494886, 98663662177 నంబర్లకు వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు పంపాలని సూచించారు.

వరల్డ్ రికార్డు సృష్టించిన అశ్వినికి సన్మానం

మర్కుక్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేవలం 58 సెంకడ్లలోపే 125 మూలకాలను సంఖ్యలతో సహా చెప్పి వరల్డ్ రికార్డ్ సృష్టించిన 9 వ తరగతి విద్యార్థిని ఒరగంటి అశ్వినితో పాటు గైడ్ టీచర్ చిన్నబ్రహ్మయ్యను మాజీమంత్రి హరీశ్‌రావు శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అశ్విని ఉన్నత చదువులను తానే చదివిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి హామీతో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య భావోద్వేగానికి లోనయ్యాడు. సన్మాన కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్రాములు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు సాదత్‌అలి, నర్సింహారెడ్డి, రాజమౌళి, రవీందర్‌రెడ్డి, బ్రాహ్మచారి, కొలుపుల రాములు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్‌రూమ్'లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను 70 శాతం పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేసిందని, కాని ఎన్నికలు రావడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. వెంటనే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం


వడ్డెపల్లిలో సీతారాముల రథాన్ని లాగుతున్న భక్తులు

రాయపోల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణం జరుపగా, సోమవారం ఉదయం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను గ్రామ వీధుల్లో భాజాభజంత్రీలు భజన పాటలతో రథంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామంలోని వీధుల గుండా రథాన్ని లాగారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మద్దూరులో పట్టాభిషేకం

మద్దూరు: మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం శ్రీ సీతారామచంద్రస్వామికి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు రోజు స్వామివారికి పానుగంటి తిరుపతయ్య వైదిక నిర్వహణలో ఘనంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి పట్టాభిషేక కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు.

సీసీపల్లిలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోహెడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచల్‌చెరువుపల్లి గ్రామంలో కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం ప్రారంభించారు. గ్రామంలోని రామాలయం వద్ద దీనిని ఏర్పాటు చేశారు. లైట్ల ఏర్పాటుకు నిధులు అందించిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.